కౌలురైతులకు పెట్టుబడి సాయం అనుమానమే

- జూలై మొదటి వారంలో అన్నదాత సుఖీభవ అమలుకు ఆదేశాలు
- జాబితాలో కౌలు రైతుల ఊసెత్తని సర్కారు


చౌడువాడలో కొబ్బరిలో సాగవుతున్న అంతరపంట

పూసపాటిరేగ: కౌలు రైతులకు మంజూరు చేసే అన్నదాత సుఖీభవ సాయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే జూలై మొదటి వారంలో రైతుల అకౌంట్లలో అన్నదాత సుఖీభవ నిధులు వేయడానికి జాబితాలు సిద్ధం చేశారు. అన్నదాత సుఖీభవ కోసం ప్రస్తుత జాబితాలో కౌలురైతులకు ఎటువంటి క్లారిటీ ఇవ్వకపోవడంతో వారిలో సందిగ్ధం నెలకొంది. అధికారంలోకి వచ్చి ఏడాది తరువాత అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులను విస్మరిస్తున్నారనే అనుమానంతో ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతులను విస్మరించి సాగుచేయని భూ యజమానులకు సుఖీభవ పథకం వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం అకౌంట్లలో వేసింది. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో పాటు, రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసే రూ.7500 కలిపి రూ.13,500 అకౌంట్లలో రైతు భరోసా పేరిట జమచేసింది. కౌలు రైతులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో రాష్ట్రప్రభుత్వమే భరించి ఆదుకుంది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో కూటమి నేతలు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులతో పాటు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేల అకౌంట్లలో వేస్తామని ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఏడాది తరువాత కౌలు రైతులను పక్కన పెట్టారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు చేయించుకుంటే అన్నదాత సుఖీభవ మంజూరవుతుందని గతంలో చెప్పారు. తీరా పథకం అమలు చేసే సమయానికి కౌలు రైతుల ఊసెత్తకపోవడంతో వారంతా అయోమయంలో ఉన్నారు. పెట్టుబడిసాయం కోసం తాజాగా ఈకేవైసీ చేయకపోవడంతో కౌలురైతులకు అనుమానం కలిగి తమ మాట ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శించిన అర్హుల జాబితాల్లో కౌలు రైతుల పేర్లు లేవు. పేర్లు ఉన్న రైతులందరికీ ఈకేవైసీ పూర్తి చేయించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 2500 మంది వరకు కౌలురైతులు ఉన్నారు. వారందరికీ గత ప్రభుత్వంలో రైతుభరోసా పేరిట నిధులు మంజూరయ్యాయి. తాజాగా సీసీఆర్ కార్డులకు సంబంధించి వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడంతో అన్నదాత సుఖీభవ వస్తుందా లేదా అనే అనుమానంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడిపెట్టి సాగు చేస్తున్న కౌలు రైతులను అన్నదాత సుఖీభవ పథకంలో పరిగణలోకి తీసుకుని పథకం మంజూరు చేయాలని కోరుతున్నారు.

కౌలు రైతులకు సుఖీభవ మంజూరు చేయాలి

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరు చేయాలి. పెట్టుబడి సాయం వస్తే మదుపులకైనా సరిపోతుంది. కౌలుకు సాగు చేస్తే, సాయాన్ని విస్మరిస్తున్నారనే విధంగా వెబ్‌సైట్ తెరవకపోవడం అన్యాయం. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ మంజూరు చేసి ఆదుకోవాలి. రామునాయుడు, కౌలు రైతు పతివాడ

వెబ్‌సైట్ తెరవాలి

కౌలు రైతులకు సంబంధించిన వెబ్‌సైట్ తెరవాలి. సీసీఆర్ కార్డులు ఇచ్చి కౌలు రైతులకు సాయం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌలు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిని ప్రదర్శిస్తోంది. కార్డులు మంజూరు చేయికపోతే ధాన్యం, మొక్కజొన్న వంటి పంటలు ప్రభుత్వానికి అమ్ముకునే పరిస్థితి ఉండదు. కౌలు రైతులకు పథకం వర్తింపచేయాలి

కె.వెంకటరావు, కౌలురైతు పూసపాటిరేగ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీడీఓ రామకృష్ణ రాజు


రామతీర్థంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ రాజు సూచించారు. ఈ మేరకు మండలంలోని రామతీర్థం గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. చెత్తను ప్రత్యేక బుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. కార్యదర్శులు విధిగా పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని చెప్పారు. అనంతరం గ్రామంలో పింఛన్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శంకర జగన్నాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిశీలన

పూసపాటిరేగ: మండలంలోని పలుగ్రామాల్లో వీఎంఆర్‌డీఏ అధికారులు మంగళవారం ప్రభుత్వ భూములను పరిశీలించారు. పూసపాటిరేగలో తులసిదిబ్బ సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, గైతులచోడవరం, కొప్పెర్ల పంచాయతీ పరిధిలో ప్రభుత్వ డీపట్టా భూములను పరిశీలించారు. ప్రభుత్వ అవసరాల నిమిత్తం భూములను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలియ జేశారు. గతంలో ఏపీఐడీసీకి కేటాయించిన భూములు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. వారితో పాటు విజయనగరం ఆర్‌డీఓ దాట్ల కీర్తి, వీఎంఆర్‌డీఏ అధికారి విశ్వనాథ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సంజీవకుమార్‌తో పాటు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం


డి.తాళ్లవలసలో రక్షిత మంచినీటి ట్యాంకు క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు

డెంకాడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు మండలంలోని డి.తాళ్లవలస గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకు క్లోరినేషన్ ప్రక్రియను నేరుగా పరిశీలించారు. ట్యాంకు పరిసరాలు, వాల్వ్‌ల వద్ద పరిస్థితిని చూశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పలు రకాల వ్యాధులను నివారించవచ్చని వివరించారు. ఆహార పదార్థాలపై మూతలు పెట్టుకోవాలని, నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓ సేవలు స్ఫూర్తిదాయకం


సత్కారం పొందుతున్న పీవీబీ రామచంద్రరాజు దంపతులు

విజయనగరం అర్బన్: విజయనగరం మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పీవీబీ రామచంద్రరాజు సేవలు ఆదర్శనీయమైనవని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డీఈఓ యు.మాణిక్యంనాయుడు అన్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ఉద్యోగవిరమణ సభలో విద్యాశాఖలో రామచంద్రరాజు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం రామచంద్రరాజు దంపతులను దుశ్శాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ పి.రామారావు, విజయనగరం అర్బన్, రూరల్ ప్రాంతాలకు చెందిన వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, మిత్రులు హాజరై రామచంద్రరాజు దంపతులను అభినందించారు.

మత్తుతో జీవితాలు చిత్తు


జమ్ము హైస్కూల్‌లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న సీఐ బంగారుపాప

విజయనగరం క్రైమ్: మత్తుపదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతోపాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విజయనగరం టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారుపాప విద్యార్థులకు పిలుపునిచ్చారు. విజయనగరం రూరల్ మండలంలోని జమ్ము నారాయణపురం హైస్కూల్‌లో ఎంఈఓ సత్యవతి, భారతీయ న్యాయ సేవా ఫౌండేషన్ సభ్యుడు శ్రీనివాస్ సోనుతో కలిసి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను సీఐ వివరించారు. మద్యపానానికి, ధూమపానానికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణ, వినియోగించే వారి సమాచారాన్ని డయల్ 100 లేదా 1972 అందించాలని విద్యార్థులకు సూచించారు. గంజాయి అక్రమ రవాణ కేసుల్లో యువత ఒకసారి అరెస్టయితే వారి భవిష్యత్తు నాశనమైనట్లేనన్నారు. నేరం రుజువైతే 10 సంవత్సరాల పైబడి జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ విజయకుమార్, సభ్యులు సత్యనారాయణ, కే.ఆర్.కె.రాజు, హరికృష్ణ, హెచ్‌ఎం హరికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యసాయి భక్తుల వితరణ


పేదలకు గొడుగు, చెప్పులు అందిస్తున్న సత్యసాయి భక్తులు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామంలో గల సత్యసాయి భక్తులు పేదలకు గొడుగులు, చెప్పులు వితరణగా మంగళవారం అందజేశారు. సత్యసాయి భజన బృందం ఆధ్వర్యంలో ఆరుగురు పేదలకు వితరణ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి ప్రతినిధులు కలిశెట్టి అప్పారావు, పప్పల బుచ్చియ్య, వాల్లె సూర్యనారాయణ, మీసాల పైడినాయుడు, కరుమజ్జి పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్లను కార్మికులుగా గుర్తించాలి


వైద్యాధికారి ప్రమీలాదేవికి వినతిపత్రం అందచేస్తున్న ఆశ కార్యకర్తలు

పూసపాటిరేగ: ఆశవర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశవర్కర్లు ఈనెల 9న నిర్వహించనున్న సమ్మెలో పాల్గొంటారని మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి ప్రమీలాదేవికి రాతపూర్వకంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం


సత్కారంలో కుటుంబాలతో పాటు ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్‌ఎస్సైలు, అధికారులు

డెంకాడ: చింతవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఏఆర్‌ఎస్సైలుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరణమణ పొందిన వారికి బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఏఆర్ ఎస్సైలు పి.శ్రీనివాసరావు, ఆర్.మోహన్, వి.భానురాజులు ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు యూనియన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి కుటుంబ సమేతంగా దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషినల్ కమాండెంట్ జి.లక్ష్మీనారాయణ్, అసిస్టెంట్ కమాండెంట్లు డీవీ రమణ, ఎస్ఎస్ బాపూజీ, అధికారులు, ,సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి ఆద్యుడు 'జయంతి'


జయంతి రామలక్ష్మణమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి ఆద్యుడు జయంతి రామలక్ష్మణ మూర్తి అని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న అన్నారు. రామలక్ష్మణమూర్తి జయంతిని జిల్లాకేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోతన్న మాట్లాడుతూ గ్రామగ్రామాన గ్రంథాలయాలు ఉన్నాయంటే అది జయంతి కృషి ఫలితమేనని అన్నారు. రామాలక్షణమూర్తి ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని కోరారు. అబ్దుల్ రావూఫ్ మాట్లాడుతూ 'జయంతి' నడయాడే గ్రంథాలయంగా అభివర్ణించారు. కార్యక్రమంలో జయంతి స్మారక గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు మజ్జి కాంతారావు, షణ్ముఖరావు, చిన్నయ్య, బాషా, సూర్యనారాయణ, దుర్గారావు, రామభద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ డీఈఈ పి.త్రినాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పూతికపేట, మొయిద, నారాయణపట్నం గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని చింతలపేట, మజ్జిపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

విజయనగరం టౌన్: విజయనగరం మూడు లాంతర్లు వద్దనున్న పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆలయ ఆవరణలోని ఆధ్యాత్మిక కళావేదిక వద్ద మంగళవారం నిర్వహించిన మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. 16 మంది మహిళలు భక్తిగీతాలను ఆలపిస్తూ కోలాట ప్రదర్శన ఇచ్చారు. వారిని ఆలయ ఈఓ కె.శిరీష ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సత్కరించారు.

అప్రమత్తతే ప్రధానం

విజయనగరం: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. గుర్తుతెలియని వ్యక్తి కమిషనర్ పేరుతో ట్రేడ్ లైసెన్సులు కట్టించుకున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజులను ఫోన్‌పే ద్వారా చెల్లించాలంటూ వచ్చే సైబర్ కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. వివిధ రకాల పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, మున్సిపల్ చార్జీలను కేవలం సచివాలయాలు, నగరపాలక సంస్థ కార్యాలయం వద్దనున్న ప్రత్యేక కౌంటర్ల వద్ద డీడీలు, చెక్కుల రూపంలోను, పురమిత్ర యాప్‌ల ద్వారా, ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన విధానాలలో మాత్రమే చెల్లింపులు చేయాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కోటసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం


డిప్యూటీ మేయర్‌కు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: పట్టణంలోని రామానాయుడు రోడ్డులో ఉన్న కోటసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఒబ్బిలిశెట్టి వెంకటరమణమూర్తి, భారతి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఏడుకొండలు, కోటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా ఇండియన్ క్రిస్టియన్ డే


సంగారెడ్డి నుంచి వచ్చిన ఏసుపాల్‌ను సత్కరిస్తున్న పాస్టర్ రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: విజయనగరం అంబటిసత్రం కూడలి వద్దనున్న యేసు ప్రేమాలయంలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రధాన కూడళ్లలో పేదలకు అన్నదానం చేశారు. పాస్టర్ అలజంగి రవికుమార్, సువర్ణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా నుంచి పాస్టర్ ఏసుపాల్‌తోపాటు క్రిస్టియన్ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రెవరెండ్ బీఎం రాజు, వివేక్, యబ్బోజు, మధుసూదన్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏసుపాల్‌ను సత్కరించారు.

జగన్నాథునికి పూలంగిసేవ



జగన్నాథుని రథ యాత్ర మహోత్సవాల్లో భాగంగా విజయనగరం హుకుంపేట గుండిచా మందిరం వద్ద ఐదో రోజు మంగళవారం జగన్నాథ బలభద్ర, సుభద్రలకు లక్ష చామంతిపూలతో అఖండ పూలంగి సేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం మణిబాబు, చక్రవర్తి ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణం, విష్ణు సహస్రనామాలు, సుందరకాండ పారాయణం జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన అనంతరం తిరువీధి, శీలవిరుపు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు బొడ్డు వెంకటేశ్వరప్రసాద్, పద్మజ, భక్తులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

వైద్యులు వెళ్లే రోడ్డు ఇలా...



చిత్రంలో కనిపిస్తున్నది విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డు. పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వైద్యాధికారులతో పాటు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. – విజయనగరం ఫోర్ట్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం: అనారోగ్యంతో బాధపడుతున్న పూసపాటిరేగ మండలం చౌడవాడకు చెందిన అసిరితల్లి కుటుంబసభ్యులకు భోగాపురం మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం అందజేశారు. అసిరితల్లి ఇటీవల అనారోగ్యం బారినపడడంతో చికిత్స చేయించుకున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో రూ.37,100 చెక్కును ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


కొవ్వాడలో మొక్కలు నాటుతున్న రఘుతో పాటు గ్రామస్తులు

పూసపాటిరేగ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కొవ్వాడ శివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. గ్రామం పరిధిలో తమ సొంత నిధులతో సుమారు 3 వేల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో శ్మశానం, మండలపరిషత్‌పాఠశాల, గ్రావెల్‌రోడ్లకు ఇరువైపులా, వివిధ పరిశ్రమలకు వెళ్లే రహదారుల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట్ల పరిసినాయుడు, దేబార్కి అప్పారావు, కోట్ల సత్యంనాయుడు, ఇజ్జురోతు సీతం నాయుడు, లెంక రామకృష్ణ, జమ్ము అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సహాయం అందించాలి


మాట్లాడుతున్న సీపీఎం నేతలు పాపారావు, తవిటినాయుడు

నెల్లిమర్ల రూరల్: రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ మండల నేతలు మొయిద పాపారావు, తవిటినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామంలో మంగళవారం వారు మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయన్నారు. ఒక వైపు కూలీల కొరత, మరో వైపు విత్తనాలు, ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయని, వ్యవసాయం చేయాలంటే పెట్టుబడి పెట్టేందుకు రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా రైతులకు పన్ బీలు రాక బ్యాంకుల్లో అప్పు కూడా పుట్టడం లేదన్నారు. తక్షణమే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పతకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యులు.. ఆరోగ్య ప్రదాతలు



వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

- సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ వైద్యుల దినోత్సవం

విజయనగరం: వైద్యులు ఆరోగ్య ప్రదాతలని, వారిని సాక్షాత్తు నారాయణ స్వరూపంగా భావించే సనాతన సంస్కృతి మనదని ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లాశాఖ సలహాదారు, వైద్యులు జి.సన్యాసమ్మ పేర్కొన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ, సీతం ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూరాలజిస్ట్ జాడ శ్రీకాంత్ మాట్లాడుతూ దేశాన్నిరక్షించేవారు సైనికులెతై, దేహాన్ని రక్షించేవారు వైద్యులని అన్నారు. మిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బలిజేపల్లి ప్రణీత, ఉంగరాల కిరణ్‌లు మాట్లాడుతూ అనారోగ్యం బారినపడి వైద్యుని చికిత్సతో సాంత్వన పొందిన వారి మనోఫలకంపై వైద్యుడు అందించిన సేవలు శాశ్వతంగా ముద్రితమవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్‌తో కలిసి వైద్యులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com